

రాష్ట్రీ విద్యార్థులతోపాటు ఐ. ఎ. ఎస్., ఐ. ఎఫ్. ఎస్., ఐ. పి. ఎస్. మొదలైన పరీక్షలలో నెగ్గజాలరు. తెలుగు విద్యార్థులు, యీ పరీక్షలలో నెగ్గకపోతే, రాష్ట్రీ స్వపరిపాలన వున్నా, తెలుగు మంత్రులే ప్రభుత్వం సాగించినా, రాష్ట్రీ పరిపాలనా వ్యవస్థ మాత్రం, పరరాష్ట్రాలనుంచి వచ్చిన ఉద్యోగుల చేతిలో వుండిపోతుంది.

ఇలాటి దురదృష్ట పరిస్థితి తెలుగు దేశానికి ఏర్పడకుండా. మా రాష్ట్రీ పరిపాలన మేమే చేసుకోగల మనే ధీమాతో తెలుగు యువకులు తమ చదువుమీదనే మనసు నిలిపి పెద్ద పరీక్షలను ప్యాసయి. పెద్ద ఉద్యోగాలను చెయ్యాలి

"ప్రభుత్వోద్యోగాలలో ఏమున్నది? దేశంలో పరిశ్రమలను పెంపొందించాలి; వ్యాపారం వృద్ధికావాలి; మేము పరిశ్రమలను స్థాపిస్తాం; వ్యాపారం చేస్తాం;" అని యువకులంతా అనుకోవడానికి వీలులేదు. ప్రతిభావంతులైన వారు ఏ వృత్తినైనా అవలంబించి, తాము బాగు పడవచ్చు, దేశాన్ని బాగుచెయ్యవచ్చు. కాని, ప్రభుత్వోద్యోగాలలోకూడా ప్రతిభావంతులైన తెలుగువారు చేరాలి. మన దేశంలో నేడు శ్రేయోరాజ్య స్థాపన జరుగుతున్నది. ప్రజల జీవితంలో అన్ని రంగాలలోను, అన్ని విషయాలలోనూ ప్రభుత్వం ఏదో విధంగా జోక్యం కలిగించుకుంటున్నది. ప్రజల శ్రేయస్సుకోసం జరిగే ప్రతి కృషితోనూ ప్రభుత్వానికి సంబంధం వున్నది. అలాటి పరిస్థితిలో, తెలుగు ప్రజల శ్రేయస్సుకోసం కృషి చెయ్యవలసిన పెద్ద ఉద్యోగులు తెలుగువారు కాకపోతే, ఆ కృషి సంపూర్ణంగా జరగజాలదు.

అంచేత, తమ భవిష్యత్తునూ, తమ రాష్ట్రీపు భవిష్యత్తునూ దృష్టిలో పెట్టుకొని తెలుగు యువకులు, పెద్ద ఉద్యోగాలను సంపాదించడానికి కృషి చెయ్యాలి.






శేఖరం గుమ్మంలో అగుడు పెట్టగానే అప్యాయంగా ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానంలో గౌరవం, అభిమానం స్ఫురించింది. తనరాక అసమ్మతం కాకపోవచ్చు అనుకున్నాడు శేఖరం. కర్రకుర్చీలు కాళీగా నిలుచుని ఆహ్వానించాయి కూర్చోమని. వరండాలోని జనం మటుమాయ మయ్యారు, శేఖరాన్ని ఒంటరిగా ఆ స్థలంలో వదిలి.

సంవత్సరం క్రితం చూసిన ఆ యింటిలో, చాలా మార్పు కనిపించింది. చనిపోయిన యింటిపెద్ద కుంకంతిలకంతో గోడమీద నిలుచుని తన వైపు చూస్తున్నాడు. ఆ యింటి వారి గౌరవం తనకూ ఆవేశించింది. మరణించిన వారంటే ఉద్భవించే సహజమైనమమత శేఖరంలో కూడా వ్యాపించింది. ఇంటిపెద్ద లేని లోపం కళావిహీనమైన గృహానికి కారణమనుకున్నాడు శేఖరం.

తాను రానన్నాడు ఇంటికి. బహుశా ఆమె తాను రానని నిశ్చయించుకుని ఉంటుంది. తనరాక గురించి ఆమె ఏమనుకుంటుంది? ఇందులో తప్పేముంది? అనుకున్నాడు శేఖరం. మాట వెనుక మనస్సు గుర్తించుకోగల మనిషి లభ్యమవడం జీవితంలో చాలా అరుదు– నవ్వుకున్నాడు శేఖరం.

కళ్ళకు కాటుక దిద్దుకుని, నలిగిపోయిన తెల్ల చీరలో ఆమె ప్రత్యక్షమయింది. అదే బిగింపు నవ్వు–అదే సొగసు నడక–రాత్రి నిద్రలేని బడలిక ముఖం–తేరిపారి చూశాడు ... శేఖరం మనస్సు వికల మయింది. బలవంతంగా విషం త్రాగుతున్నట్లు–అమృతభాండం

పోతుకూచి సాంబశివరావు

జారిపోయినట్లు — ఆకాశంలోంచి విడిపోయి నేలమీద పడి తల పగిలినట్లు— శరీరం నిండా భోగిమంటలు పెట్టినట్లు— ఆమెను చూడగానే శేఖరం తల్లడిల్లాడు.

మరణవేదన—అయింట్లో—ఆమెలో—శేఖరంలో—స్ఫురించింది—ఎటొచ్చీ కారణాలు వేరు.

కళ్ళు—మనస్సు చెప్పుకునే గుసగుసలు వాస్తవిక జీవితానికి దూరమైపోయాయి.

'మిమ్మల్ని ఆఖరుసారి కలుసుకోవాలని'... శేఖరం సంభాషణ ప్రారంభించాడు.

'మీకు తోచినప్పుడు కలుసుకోవచ్చు!'

'ఆ అదృష్టం జారిపోయిందిగా!' తల దించుకున్నాడు శేఖరం.

ఆమె తన కాటికకళ్ళు సరిచేసుకుంది కొంగుతో—ఆమె భావ మేమైనా, కళ్ళ అందం ఇనుమడించింది కొంగు సవరింపుతో—

'అదృష్ట మనేది కొందరికి అర్హత బట్టి లభిస్తుంది...నాకు అదృష్టమూ లేదు...అర్హతా లేదు!' శేఖరం బలవంతంగా ఆమెవైపు నవ్వాడు.

శేఖరం కూర్చున్న కుర్చీ ప్రక్కనుంచి ఎక్కి అలమరులోకి దూరాడు ఒక కుర్రాడు. శేఖరం, ఆమె మధ్యగా నిలుచున్నాడు చోద్యంగా మరొక కుర్రాడు— మాటలు పరిశీలిస్తూ— ఒక గాలిబూరా టప్పున పేల్చింది ఒక చిన్నపిల్ల.

'వెధవ పిల్లలు—ఒకటే అల్లరి'— శేఖరం తేరిపారి ఆమె కన్నుల్లోకి చూశాడు.

ఆమె మాతృమూర్తి అయ్యాక— పిల్లలు యిలా వేధించుకు తింటూంటే— ఒక ఈసడింపు—మమతతో— ఎప్పుడో తాను చూడవలసిన దృశ్యం అక్కడే కనిపించింది....

గదిలోంచి ఒక ప్లేటులో తీపిమిఠాయి తెచ్చి పెట్టింది ఆమె!

'తినండి!'

'ముట్టుకోను'

'ఏం?'

'నాకు సంబంధించని వాటిని తీసుకోను!'

'అది మీకోసమే!'

'ఋజువు?'

'నేను లాయరులా వాదించలేను!'

'అవి తిని జబ్బు చేస్తే డాక్టరులా మందిస్తారు కాబోలు!'

'ఏమో!' ఆమె మళ్ళీ నవ్వింది బిగింపుగా.'

ఆమె బిగపట్టిన నవ్వుల అందం, ఆమె అందించని జీవిత ఆనందంలా— దూరంగానే అదృశ్య మైంది.

'ఆస్పత్రులచుట్టూ నిశ్శబ్దంగా ఉండాలి రహదారి...ఆస్పత్రుల్లో ఉండే మీచుట్టూ ఉన్న నా జీవితం బలవంతంగా నిశ్శ



బ్దాన్ని భరిస్తోంది' శేఖరం సూచన అర్థం కానట్లు చూసింది ఆమె.

'మీమాటలు నాకు అర్థం కావు— నేను ప్రయోజన శూన్యంగా ఊహించలేను!'

'కాని ఊహను రెచ్చగొట్టి ప్రయోజన శూన్యం చెయ్యగలరు!' ఆమె నిశితంగా శేఖరం వైపు చూసింది. 'ఏమో'! బిగింపుగా మళ్ళీనవ్వింది.

'గతం విస్మరిస్తాను'! నిట్టూర్చాడు శేఖరం.

ఎదురుగా ఒక కప్పు పాలు!

'తీసుకోండి—ఆ మిఠాయి' మరొక స్త్రీ గౌరవం.

'వద్దండి— ఇప్పుడే ఫలహారమయింది!'

'అయినా—కొద్దిగా తీసుకోవచ్చు!' ఆమె నవ్వింది.

'తీసుకోండి— ఎప్పుడో కాని రారు మా యింటికి—' పరస్త్రీ మందలింపు!— నిష్క్రమణ—

శేఖరం మిఠాయిముక్క చిదిపాడు..

'చేతులు కాలుతున్నాయా? చిన్నగా చిదుపుతున్నారు!'

'చేతులు కాదు—గుండె!'—ఏదో విద్యుచ్ఛక్తి ప్రసరించినట్లు—వ్రేళ్ళు!'

'ఓహో!' ఆమె వెటకారంగా నవ్వింది.

నిద్ర—కల—కలలో అల—టెలిఫోను మ్రోగింది...పిచ్చిగా మీకోసం మాట్లాడాలని కాచివున్నా.....అది కూడా నిజంగా కలేమో!



"మా ఆయన తాతగారు నాలుకతో సితారా వాయించేవారట."

"ఏంగొప్పా? మావారి తాతగారు ముక్కుతో ఫిడేలు వాయించేవారు."

---

ఈ ప్రవర్తనకు ఆకలకు చాలాతేడా!

ప్రయోజన శూన్యమైన ఊహాగానం తనది— శేఖరం నమ్మాడు.

పద్దెనిమిదేండ్ల గారాబు కొడుకును పోగొట్టుకున్న ఒక తల్లి అతని కోసం దుఃఖించేది. చనిపోయిన కొడుకు ఎదురుగా ఉన్నట్లు కలలు కనేది— పలవరించేది......అలాగే లేనిది నిజంగా ఊహించుకునే పిచ్చిస్థితిలో పడ్డాడు శేఖరం.

ఆ రోజు మాట్లాడా లనుకున్నాడు— వివాహం గురించి— మొదటిసారిగా— మూడేళ్ళ పరిచయంలో—

ఆమే ముందుగా మాట్లాడింది తన వివాహానికి ఆహ్వానిస్తూ— 'నానుంచి

మీకేమీ లభ్యం కాదు' – అది ఆమె మాట – కాని చూపులో భాష వేరు—

అందాల క్రూరత్వం ఆమెలో మూర్తీభవించింది.

అతను ఏడ్చాడు – సహజంగా – గుండెల్లో ఆవేదన ఉబికి—

మగాడు ఏడ్వడం—ఆడది నవ్వడం—అది మొదటిసారి శేఖరం చూశాడు – ప్రకృతి విభిన్నంగా కనిపించింది ఆ సన్నివేశంలో. శేఖరం లేచాడు ఆవేదనతో; నిష్క్రమించడానికి!

శేఖరం కన్నీరు అర్థం చేసుకున్న ఆమె అడిగింది 'మీమనస్సు మునుపు ఎందుకు చెప్పలేదు?'

"అవకాశ మిస్తేగా!"

"మీరు నాతో మామూలుగా మాట్లాడాలి – ఉండరూ"?

ఉండక ఏం చేస్తాడు శేఖరం?

అది ఒక సహజ సన్నివేశం—

కాని ఇప్పుడు.

'వెడతాను' లేచాడు శేఖరం.

'వెళ్ళండి.' ఆమె లేచింది.

కొంచెం జరూరు పనుంది!'

'ఊ తక్షణం వెళ్ళండి!' ఏమిటో కసిగా బిగింపుగా నవ్వింది ఆమె.

ఆమె స్వాగతంలో ఆదరణ లేదు – ఆమె వీడ్కోలులో మర్యాద లేదు—

'మర్యాదలు తెలియని మనిషిని!' ఆమె ఒకప్పుడు చెప్పిన మాటలు వినిపించాయి శేఖరానికి!

'ఎప్పుడు పెళ్ళి?'

'ఎన్నిసార్లు చెప్పాలి?'

'మతిమరుపు!'

'వచ్చేనెల!'

'ఒకమంచి బహుమతి యిస్తా!

'నేను తీసుకోను!'

'తీసుకోకపోతే-విసిరేస్తామీయింట్లో!

'మంచిదే.' ఆమెఆలోచనలోపడింది.

'ఏమిటి?'

'అదే—ఏం బహుమతి యిస్తారా అని'

'ఒక చిన్న ఆటబొమ్మ – మీకు పుట్టబోయే బిడ్డకు!....తలాడిస్తున్న ఒక గిడ్డతాత బొమ్మ—'

'మీలాగే వుంటాడా?'

శేఖరానికి ఎదురు దెబ్బతిన్నట్లయ్యింది. తన్ను తాతగా పరిగణించిందా? – ఆమె –

'ఏమో!' మనస్సులో బాధపడ్డాడు శేఖరం. ఒక విచిత్రగతి-ఆమెకు పెళ్ళవుతుంది—పిల్లలు పుడతారు—ఆమె మరొక ప్రపంచంలో ఉంటుంది—ఇంటిబాధ్యత—ఆస్పత్రిలో ఉద్యోగం – స్నేహితుల పలకరింపులు – పిల్లల అవసరాలు – మనస్సులో హత్తుకొన్న యౌవన దశలోని ఒక మనిషి కల్పించిన చిన్న సన్నివేశం జీవితంలో అడుగున పడిపోతుంది – ఆమె బాధ్యతలు సృష్టించిన మరుంపులో శేఖరం కరిగి పోతాడు – అది మరీ బాధ – తనకి అక్కడ స్థానం లేదనుకున్నాడు శేఖరం—



"ఆరెరె! గడ్డం చెయ్యిరా అంటే అమాంతంగా బంగార్లాంటి క్రాపు క్షణంలో ఊడ్చేశావేంరా?"

"అచ్చరాల నమ్మండి బాబు! ఇందులో నా బుద్ధేం లేదు, అదేం మహాత్తెమో! ఆ సామి కనపడతా ఉంటే నా చెయ్యి ఏంజేస్తోందో నాకేం తెల్సింది గాదు!"

కాని తనకు ఊహాశక్తి – ప్రబలమైన శత్రువు! మరిచిపోలేని మనస్సు తనది – ఈ వ్యధ దేనికి?

'నా మెదడు శస్త్రచికిత్స చెయ్యకూడదూ – ఆలోచనాశక్తి లేకుండా?'

'నా కళ్ళు పీకిపారెయ్య కూడదూ – మిమ్మలిని చూడకుండా!'

'నా గుండెలో రక్తంపిండి పారెయ్యకూడదూ – హృదయంలో భావాల ఉధృతం లేకుండా?'

'నాకు విషంమందు యివ్వకూడదూ—నా బ్రతుకులో బాధలే లేకుండా?'

శేఖరం ప్రశ్నలు ఆమెను చకితుణ్ణి చేశాయి.

"నేను అనుభవం లేని డాక్టరుని జీవితంలో – రోగులను చూస్తేనాకు భయం – నావృత్తి ఎలా నడుస్తుందో!"

ఆమె మాటలోని చమత్కారం శేఖరానికి వెన్నుపోటయింది.

అనుభవమున్న డాక్టరు – అనుభవం లేని డాక్టరు – ఒకరు సునాయాసంగా – మరొకరు అనాలోచనగా రోగులను హత్య చెయ్యగలరు?'

'ఏమో!' ఆమె మళ్ళీ బిగింపుగా నవ్వింది – ఆ నవ్వులోని మార్దవం – కాంతి – ఆకర్షణ – శేఖరాన్ని ఉత్తేజితుణ్ణి చేశాయి – ఆమె విశాలమైన కళ్ళు – ఒళ్ళంతా ముళ్ళ బాణాలు విసి

రాయి. అంపశయ్య మీది భీష్ముడిలా, తన మరణకాలం కోసం వేచి ఉండి, తనచావు స్థితికి అంతం కల్పించాలి — ఎటొచ్చిభీష్ముడు కోరికలు జయించాడు— తానుకాదు — నిట్టూర్పులు దిగమ్రింగాడు శేఖరం—

'నమస్కారం — సెలవు'

'వెళ్ళండి—'

'వెళ్ళలేను—మళ్ళీ ఎప్పుడు దర్శనం?

'ఏమో!'

'అవును — ఎప్పుడో బజారుల్లో — ఆస్పత్రుల్లో — సినిమాల్లో — ఎక్కడో ఒక మెరుపు దర్శనం!'

'ఊహాశక్తి ఉంటే నిత్యం ప్రత్యక్షమే ప్రతీ వస్తువు!'

ఊహలోనే బ్రతుకమని ఆమె వీడ్కోలు సందేశం.

ఊహాగానంలోనే ఆనందం పొందమని ఆమె వీడ్కోలు సందేశం.

బాహ్యంగా బాధ కనిపించక, విపరీతంగా బాధకలిగించే క్రూరత్వం ఆమెలో అంది! శేఖరం బాధతో లోలోపల మూల్గాడు.

తరాలు గతిస్తాయి—నరాలు బలహీనమౌతాయి — మందులు పనిచెయ్యవు — డాక్టర్లు జీవితంలో వృథా అనిపిస్తారు — శరీరాలు కూలుతాయి-ఇది జీవితసత్యం!

ఒక పశువుమీద ఆధారపడిన పాలేరు పాలు పితికి యిచ్చాడు ఆయింట్లో!

పాలమీది ధనం ప్రధానం పాలేరుకు: పశువు కాదు!

ప్రాపంచిక సుఖం ఆశించిన మనిషికి-నిజాయితీ సత్యం — చాలా దూరం!

శేఖరం బాధగా లేచాడు నిష్క్రమించడానికి ఆయింటినుంచి.

కట్టుకున్న ఎర్రపైకందిన గుండెలా కనిపించింది బాహ్యంగా!

ఎన్నో మాట్లాడాలని తహతహలాడిన అతని మనస్సు తలుపులు బంధించుకుని ఏడ్చింది.

వీధిలో ఒకడుగు వేశాడు శేఖరం

'క్షమించండి — మీకు ఆలస్యమైందేమో!'

ఆమె నవ్వుతూ వెనకనుంచి పలకరించింది!

విచారంతోపోయే మనిషిని పిలవడం దేనికి?

భూమిని ప్రేమించే మనకు చీకటి — ఆకాశంలో తారలు తళుక్కుమని కనిపించేయి. అందని ఆకాశంలోని తారలు వెలుగు నిస్తాయి చీకట్లో.

ఆమెకూడా అంతే—తనజీవితంలో— శేఖరం తృప్తిగా నవ్వుకున్నాడు.



# పనిలేని మంగలి

"ముష్టి" అనే మాటకి మనదేశంలో చాలా తేలికైన అర్థం ఎందుకు వచ్చిందో సరిగా తెలియటం లేదు. "ముష్టి మూడు నయాపైసలు" అంటాం అందరమూను. కొందరు "ముష్టి మూడు రూపాయలేగా!" అనటం కూడా కద్దు. "ముష్టి మూడు వందలు, ముష్టి మూడువేలు, ముష్టి మూడు లక్షలు" అనగల ఆసాములు మన దేశంలో లేకపోలేదు. "ముష్టి మూడు కోట్లేనా?" అనేవాళ్లు మాత్రం మన దేశంలో లేరు; నోరుజారి ఎవరైనా అన్నారో వాళ్లను విచారణకు పెట్టి పత్రికల నిండా వేసేస్తారు.

ఇతర దేశాలలో "ముష్టి ఎత్తటం" అంటే విజయం సాధించామనో, సాధిస్తామనో అనటం. మన దేశంలో — ఎందుకు, పోనివ్వండి! మన దేశంలో కూడా ఒకప్పుడు "ముష్టి"కి కొంత మర్యాద జరిగేది. కంసుడి దగ్గిర ఉండే మల్లులలో ఒకడు ముష్టికుడు; వాణ్ణిచూసి అందరూ హడలేవాళ్లు. కృష్ణుడు వాడి గుండెలమీద ఎక్కి కూచుని తనముష్టితో రెండు మూడుసార్లు పొడిచేసరికి వాడి ముష్టి బలం కేవలం "ముష్టి" బలమై పోయింది. ఇదంతా మనం సినిమాలో కూడా చక్కగా చూశాం....

పై దేశాలలో ముష్టికి గల పరపతి ఇంకా చెడలేదు. మనదేశంలో మటుకు ఎవరన్నా పిడికిలి బిగిస్తే ఇంకొకరికి ఇంత ఇవ్వటానికే తప్ప "ఇచ్చుకోవటానికి" మట్టుకు కాదు. కొందరు ఎవరికీ ఏమీ ఇవ్వకుండా ఉండటానికి కూడా పిడికిలి బిగిస్తారు. వాళ్లు నిజంగా "ముష్టి" వాళ్లే.

"ముష్టి ఎత్తటం" బతుకుతెరువుల్లో ఒకటి; "ముష్టి వెయ్యటం" నికరమైన పుణ్యం; అది ఆలోకంలో మనపేర జమ అయి వడ్డీ సంపాదిస్తూ ఉంటుంది. ఈ రహస్యం మన పూర్వీకులు ఒక ముష్టి ధర్మం ప్రతిపాదించి, అది అన్ని యుగాలలోనూ అమలు జరిగేటందుకు తగిన ఏర్పాట్లన్నీ చేశారు.

ఈ ముష్టి సంప్రదాయం దేశ మంతటా రకరకాలుగా అమలు జరుగుతున్నది.దీనియొక్క ప్రాచీన స్వరూపం దక్షిణ దేశంలో కలితీ లేకుండా కానవస్తుంది. ఇక్కడ ముష్టివాళ్లంటూ ఒక ప్రత్యేకమైన జాతి గాని, తెగగాని